క్లుప్తంగా

పేదలకు రగ్గుల పంపిణీ



పేదలకు రగ్గులు పంపిణీ చేస్తున్న శాంతకుమారి

పెనుమంట్ర: మానవ సేవే మాధవసేవ అని చెప్పిన మహనీయుల సూక్తులను ఆచరిస్తూ తోటివారికి చేతనైన సహాయం చేయడంలో ఆనందం దాగి ఉందని భగవాన్ బుద్ధ సేవా సమితి వ్యవస్థాపకుడు తాడిపర్తి సంపత్‌రావు అన్నారు. ఆదివారం పొలమూరు అంబేడ్కర్ నగర్‌లో గౌతమ్‌రాజు పేదలకు రగ్గులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా సంపత్‌రావు మాట్లాడుతూ 30 మంది పేదలకు దాతల సహకారంతో రగ్గులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డు హాస్టల్ వార్డెన్ బింకం సూర్యప్రకాశరావు, దాతలు చిగురపాటి శాంతకుమారి, కేతా రామకృష్ణ, వార్డు సభ్యులు తాడిపర్తి ధనలక్ష్మి, సీఆర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో ప్రతిభ


మాధవిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శోభారాణి

పాలకొల్లు సెంట్రల్: ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరంలో నిర్వహించిన అంతర్ కళాశాలల యోగా పోటీల్లో విద్యార్థిని చెల్లూరి మాధవి ప్రతిభ కనబరచడం అభినందనీయమని డీఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ డా. శోభారాణి అన్నారు. ఆదివారం దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థిని మాధవిని అభినందించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ శుక్రవారం నన్నయ్య యూనివర్శిటీలో జరిగిన పోటీల్లో యూనివర్సిటీ స్థాయిలో నాలుగో స్థానం సాధించిందన్నారు. ఈ నెల 24 నుంచి ఒరిస్సాలో కళింగ విశ్వవిద్యాలయంలో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీఈటీ లంకలపల్లి రమేష్, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని మాధవిని అభినందించారు.

బెల్టు షాపులపై దాడి



వడలిలో బెల్ట్ షాపు నిర్వాహకుడితో అధికారులు

పెనుగొండ: మండలంలోని వడలిలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఉప్పలపాటి బ్రహ్మయ్యను అరెస్ట్ చేసి, 8 మద్యం బాటిల్లు స్వాధీనం చేసుకున్నట్లు తణుకు ప్రోహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఎస్. మణికంఠరెడ్డి తెలిపారు. ఆదివారం గ్రామంలో తనిఖీలు నిర్వహించామన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్సై బి.లక్ష్మీ, హెచ్‌సీ కె.అప్పలస్వామి, వై.శ్రీమన్నారాయణ, సిబ్బంది జి.ఫణి భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పట్టణ ఎక్సైజ్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో మండలంలోని చింతపర్రు గ్రామంలో మద్యం సీసాలు విక్రయిస్తున్న ఎ.నాగేశ్వరరావును అదుపులోకి తీసుకున్నామని ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం జరిపిన దాడుల్లో నాగేశ్వరరావు నుంచి 5 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిపై కేసు నమోదు చేశామని వివరించారు. కార్యక్రమంలో ఎస్సైలు జి.రఘు, పి.మహేష్ పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుని రథోత్సవం



గుంపర్రులో సుబ్రహ్మణ్యేశ్వరుని రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: మండలంలోని గుంపర్రులో శ్రీవల్లి దేవసేనా సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్య షష్టి ఉత్సవాల్లో ఆదివారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు కొమాళ్లపల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఉదయం అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల మధ్య రథోత్సవం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం పల్లకి ఉత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు వివరించారు.

అటకెక్కిన స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్


భారీ విస్తీర్ణంలో ఉన్న నరసాపురం మంచినీటి కుళాయిచెరువు


పంజాసెంటర్‌లో పైప్‌లైన్ లీకైన దృశ్యం (ఫైల్)

- రూ.61.81 కోట్లతో మంచినీటి పైప్‌లైన్స్ ప్రక్షాళనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ యత్నం
- ప్రాజెక్ట్ ఊసే ఎత్తని కూటమి సర్కార్

నరసాపురం: నరసాపు మున్సిపాలిటీలో పాత పైప్‌లైన్‌లను పూర్తిగా ఆధునికీకరించడంతో పాటుగా అదనంగా ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణం చేపట్టే పనులు అటకెక్కాయి. మున్సిపాలిటీలో రూ.61.81కోట్లుతో స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్‌ను 2022 నవంబర్‌లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రభుత్వం మారడంతో ఈ ప్రాజెక్ట్ ఊసేలేకుండా పోయింది. దీనికి సంబంధించి గత ప్రభుత్వం సాంకేతిక అనుమతులు ఇస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ద్వారా జీవో నెంబర్–15 విడుదల చేసింది. అంతే కాకుండా ప్రాజెక్ట్‌లో భాగంగా ముందుగా ఓహెచ్‌ఆర్ నిర్మించాలని నిర్ణయించి నిధులు కూడా మంజూరు చేశారు. దీంతో దాదాపు 45 ఏళ్ల దీర్ఘకాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అందరూ భావించారు. అయితే ప్రజలకు చివరికి నిరాశ మిగిలింది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పట్టణంలో 70 ఎకరాల భారీ విస్తీర్ణంలో మంచినీటి చెరువు ఉంది. మంచినీటి చెరువులో ఎప్పుడూ 586 మిలియన్ లీటర్లనీరు అందుబాటులో ఉంటుంది. మంచినీటి సరఫరాకు మూడు రిజర్వాయర్లు ఉన్నాయి. 60 వేల జనాభా ఉన్న పట్టణంలో 8,760 గృహ కుళాయి కనెక్షన్లు, 120 పబ్లిక్ కుళాయిలు, 596 వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి.

పైప్‌లైన్స్‌తోనే అసలు చిక్కు

మునిసిపల్ లెక్కల ప్రకారం చూసుకుంటే చెరువులో అందుబాటులో ఉన్న నీటిని వేసవిలో కాలువలు కట్టేసినా కూడా ఏ ఇబ్బందిలేకుండా రెండు పూటలా అందించవచ్చు. కానీ కుళాయిల ద్వారా సమృద్ధిగా నీళ్లు అందని పరిస్థితి నెలకొంది. అయితే అసలు చిక్కంతా పైప్‌లైన్స్ శిథిలమవ్వడం వల్లే వస్తుందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. పైప్‌లైన్లు బాగోలేక పోవడంతో తక్కువ ప్రెజర్‌తో నీటిని వదులుతారని, దీంతో కుళాయిల ద్వారా నీళ్లు సవ్యంగా రావని చెబుతున్నారు. ఒకవేళ ఎక్కువ ప్రెజర్‌తో నీటిని వదిలితే పైప్‌లైన్స్‌కు ఇంకా పెద్ద సంఖ్యలో లీకేజీలు ఏర్పడే పరిస్థితి ఉంది. పైప్‌లైన్‌ల లీకేజీలు కారణంగా రాయిపేట, రుస్తుంబాధ, స్టేషన్‌పేట, చినమామిడిపల్లి, వీవర్స్‌కాలనీ, వైఎస్సార్‌నగర్, నందమూరికాలనీ ప్రాంతాల్లో నీటి ఎద్దడి నెలకొంటుంది. శివారు ప్రాంతాల్లో పరిస్థితి అయితే మరింత దారుణంగా ఉంది. పొన్నపల్లి, మాధవాయిపాలెం, చిమామిడిపల్లి ఓఎన్జీసీకాలనీ, జవదాలవారిపేట, లాకుపేట ప్రాంతాల్లో నీటి కొరత వేధిస్తుంది. 1956లో మున్సిపాలిటీ ఏర్పడితే ఇంచుమించు 45 ఏళ్ల క్రితం నిర్మించిన పైప్‌లైన్‌ల ద్వానే నీటిని ప్రజలకు అందిస్తున్నారు అప్పటి నుంచి పైప్‌లైన్స్‌ను ఆధునికీకరించాలనే ఆలోచన గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేదు. అయితే గత ప్రభుత్వం చొరవ చూపినా ప్రయోజనం లేకుండా పోయింది.

ప్రాజెక్ట్ స్వరూపం ఇదీ..

పట్టణంలో ప్రస్తుతం 3 ఓహెచ్‌ఆర్‌లు ఉన్నాయి. స్పెషల్ ప్రాజెక్ట్‌లో భాగంగా మరో నాలుగు ఓహెచ్‌ఆర్‌ల నిర్మించాలని నిర్ణయించారు. చినమామిడిపల్లిలో ఓ ఓహెచ్‌ఆర్ నిర్మాణం చేపట్టారు. అలాగే ప్రస్తుతం 96 కిలోమీటర్లు మేర పైప్‌లైన్‌లు ఉన్నాయి. వీటిలో 40 కిలోమీటర్లు మేర పైప్‌లైన్‌లు పూర్వం ఎప్పుడో వేసినవే, కాబట్టి వీటిని పూర్తిస్థాయిలో ఆధునీకరించాలని నిర్ణయించారు. దీనికి తోడుగా కొత్తగా దాదాపు మరో 30 కిలోమీటర్లు మేర శివారు ప్రాంతాలకు పైప్‌లైన్‌లు నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం ఉన్న నీటిశుద్ధి కేంద్రాన్ని పూర్తిస్థాయిలో ఆధునికీకరించేలా ప్రాజెక్ట్ రూపకల్పన చేశారు. అయితే ఇన్ని చేసినా ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్ పనులను అసలు పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా స్పందించి స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

మంజూరు చేసిన ప్రాజెక్ట్‌ను గాలికి వదిలేశారు



నరసాపురం అభివృద్ధికి గత ప్రభుత్వం మంజూరు చేసిన అన్ని ప్రాజెక్టలను గాలికొదిలేశారు. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులను కూడా నిలిపివేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణమూ లేదు. ఇప్పుడు పైప్‌లైన్స్ ప్రక్షాళన ప్రాజెక్టది కూడా ఇదే పరిస్థితి. నరసాపురంలో భారీ విస్తీర్ణంలో మంచినీటి చెరువు ఉంది. కానీ పైప్‌లైన్స్ వల్లే ఇబ్బందులు ఉన్నాయి. కానీ ఈ సమస్య పరిష్కారానికి రూ.61.81 కోట్లుతో పట్టణంలో స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్‌కు అప్పటి ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు చొరవ చూపించారు. నిధులు అందుబాటులో ఉండి కూడా పనులు చేపట్టకపోవడం దారుణం.

– బర్రి శ్రీవెంకటరమణ, మునిసిపల్ చైర్‌పర్సన్

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి


కుంచిలపల్లి వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: విద్యారంగ సమస్యలను సీఎం చంద్రబాబు పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి విషయాన్ని రాజకీయంగా ప్రచారం చేసుకోవడం అలవాటుగా మారిన చంద్రబాబు విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్ మీట్‌ను ప్రచారం కోసమే వాడుకున్నారని తేలిపోయిందని పేర్కొన్నారు. దిశా నిర్దేశం లేకుండా ఏమి ఆశించి ఆత్మీయ సమావేశాలు నిర్వహించారో? విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఏ ఫీడ్ బ్యాక్ తీసుకున్నారో చెప్పాలని ఆయన నిలదీశారు. ఎన్నికల ముందు నీకు 15వేలు.. నీకు 15వేలు అని ప్రచారం చేసుకుని ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడచినా తల్లికి వందనం ఎందుకు అమలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు హాజరైన బాపట్లలోని తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో తల్లికి వందనం అమలుకి ప్రకటన చేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశించినా ఎలాంటి ప్రకటన చేయకుండా నామమాత్రంగా కార్యక్రమాన్ని నిర్వహించి వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు నిరాశకు గురయ్యారన్నారు. మాజీ సీఎం జగన్ రాష్ట్రంలోని అనేక పాఠశాలలను నాడు నేడు పథకంలో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు.

నేడు పాలకొల్లులో పాస్టర్స్ క్రిస్మస్ ఆరాధన

పాలకొల్లు అర్బన్: పట్టణ, మండల పాస్టర్స్ ఫెలోషిప్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యం ౨డ పాస్టర్స్ క్రిస్మస్ ఆరాధన పాలకొల్లు త్రియేక దేవుని సంఘం, వడలివానిపేట పాస్టర్ గొల్ల రాజబాబు చర్చి ఆవరణలో సోమవారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు సంఘ గౌరవాధ్యక్షుడు ఐ.సెయింట్ పాల్, అధ్యక్షుడు గోచేరు ఏసుకృపా శ్యాంసన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటనలో విడుదల చేశబూరు. ఈ క్రిస్మస్ ఆరాధనకు రాష్ట్ర పాస్టర్స్ ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి మేడిది జాన్సన్ ముఖ్య అతిథిగా హాజరుతారని పేర్కొన్నారు.

మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు


వెలగలవారిపాలెంలో గోస్తనీ కాలువ గట్టున నెట్టెలు కట్టిన ధాన్యం బస్తాలు


రైసు మిల్లువద్ద రోడ్డుపైనే నిలిచిపోయిన ధాన్యం లోడుతో ఉన్న వాహనాలు

పెనుమంట్ర: ఇటీవల తుఫాన్ ప్రభావంతో వరికోతలు నిలిచి, ధాన్యం మాసూళ్లు పూర్తిస్థాయిలో జరగకపోవడంతో ముందుగా మాసూళ్లు జరిగిన రైతులు ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా రైసుమిల్లులకు తరలిస్తున్నారు. రెండు రోజులుగా ముమ్మరంగా కోత మెషీన్‌లతో ధాన్యాన్ని మాసూళ్లు చేసిన రైతులు సంచులుకోసం రైతు సేవా కేంద్రాలకు పోటెత్తడంతో ఆయా కేంద్రాల్లో సంచుల కొరత ఏర్పడింది. దీంతో ముందుగా నమోదు చేయించుకున్న రైతులకు రెండు రోజుల్లో సంచులు సరఫరా చేస్తామని స్థానిక అధికారులు చెబుతుండగా ముందుగా ధాన్యం మాసూళ్లు చేసి రైస్‌మిల్లులకు తరలిస్తున్నా అక్కడ దిగుమతి కాకపోవడంతో రోజుల తరబడి అక్కడ వాహనాలు రోడ్లపై ధాన్యం లోడుతో నిరీక్షించాల్సి వస్తుంది. కొన్ని రైసు మిల్లులు అయితే టార్గెట్‌లు పూర్తయ్యాయని, తాము మరో రైసు మిల్లుకు పంపిస్తామని రైతులకు కొద్దిరోజులు డబ్బులు పడే విషయం ఆలస్యం కావచ్చని కొందరు దళారులు రైతులను మభ్యపెడుతున్నారు. దీంతో కాలువగట్టుపైన రోడ్లమీద ధాన్యం బస్తాలు నెట్టెలు కట్టి దర్శనమిస్తున్నాయి.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. అయ్యప్ప, భవానీ మాలధారులు పెద్ద ఎత్తున తరలిరావడంతో అమ్మవారిని ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ ఎం.అరుణ్ కుమార్, ఆలయ, చైర్మన్ కడలి మాణిక్యాలరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హైందవ శంఖారావ సభను విజయవంతం చేయాలి


యలమంచిలి: హైందవ శంఖారావ సభలో పాల్గొన్న హిందువులు

యలమంచిలి: జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావ సభను విజయవంతం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ పాలకొల్లు ఖండ్ సంఘచాలక్ కెవీఎల్ నరసింహరాజు కోరారు. స్థానిక కేశవ స్వామి ఆలయంలో ఆదివారం జరిగిన హైందవ శంఖారావ సభ ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడతూ మన దేశం లౌకిక దేశమని చెప్తారన్నారు. కానీ మన దేశంలో హిందూ ఆలయాలపై ప్రభుత్వాలకు ఉన్న నియంత్రణ ఇతర మతాల కోవెలలపై లేదన్నారు. అన్యమతస్తులు సైతం మన ఆలయాల్లో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. కాబట్టి దేవుడికి వేసే ముడుపులు మన హిందూ ధర్మ అభివృద్ధి కాకుండా ఇతర అవసరాలకు మరలతున్నాయన్నారు. ఆఖరికి వందలాది ఎకరాల భూములు ఉన్న ఆలయాల అర్చకులకు జీతాలు చెల్లించడం లేదన్నారు. ఈ సమస్యలన్నింటిపై పోరాటం చేసి, హిందూ దేవాలయాలన్నింటికీ స్వయం ప్రతిపత్తి కలిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికే విజయవాడలో హైందవ శంఖారావ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ మన్నే కుమారస్వామి, సభ్యులు వాడపల్లి గోపి కృష్ణమాచార్యులు, చిలుకూరి ఆంజనేయులు, తోట సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

దేవాలయాల నిర్వహణను అప్పగించాలి

మొగల్తూరు: స్వాతంత్ర్యం సాధించి 77 సంత్సరాలు పూర్తి చేసుకున్నా హిందువులకు మాత్రం దేవాలయాలు తమకు తామూ నిర్వహించుకునే స్వతంత్ర హక్కు నేటికీ రాలేదని పూజ్యశ్రీ నాగానంద సరస్వతి స్వామిజీ పేర్కొన్నారు. ఆదివారం మొగల్తూరులోని అభ్యాస్ కళాశాలలో ఏర్పాటు చేసిన హిందూ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శృంగవృక్షానికి చెందిన దత్తపఠం స్వామిజీ నాగానం సరస్వతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం భారీ బహిరంగ సభను జయప్రదం చేసేందుకు ప్రతి హిందువూ కృషి చేయాలని కోరారు. హిందువుల మనోభావాలను, సమస్యలను అర్థం చేసుకుని ప్రభుత్వం వెంటనే స్పందిచాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, వివిధ క్షేత్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

హిందూ దేవాలయాలకు విముక్తి కల్పించాలి

పెనుగొండ: హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి చేసి, స్వయం ప్రతిపత్తి కలిగిన ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ చట్ట సవరణ చేయాలని గీతాశ్రమ పీఠాధిపతి సత్యానంద గిరి స్వామిజీ అన్నారు. ఆదివారం సిద్ధాంతంలో విజయగోపాలస్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి హిందూ సమ్మేళనంలో పాల్గొన్నారు. హిందూ సమాజ సంరక్షణే దేశ శ్రేయస్సుఅన్నారు. దేవాలయాల్లో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ గోదావరి విభాగ కార్యకారిణి సభ్యులు చింతాకుల గోపాల కృష్ణ, మండల కన్వీనరు సానబోయిన ఊర్ధన్య, దొడ్డిపట్ల నాగూరు, వంగూరి రామకృష్ణ, ఆకి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని కోరారు.

రామాలయంలో భగవద్గీత పారాయణం


భగవద్గీత పారాయణంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: భగవద్గీత హిందూ సమాజంలో రుగ్మతలను తొలగించే అద్భుతమైన గ్రంథమని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర మహిళా ప్రముఖ్ తొట్టెంపూడి సునీత అన్నారు. ఆదివారం స్థానిక సుబ్బారాయుడు గుడి సమీపంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో గీతా జయంతి పురస్కరించుకుని భగవద్గీత పారాయణ చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్ముడు అర్జునుడిలో సార్యాన్ని రగిలించి అధర్మంపై విజయం సాధించడానికి ఏ విధంగా గీతోపదేశం చేశారో? భగవద్గీత పారాయణంతో తెలుస్తుందన్నారు. హిందూ సమాజంలో ప్రతి ఒక్కరూ భగవద్గీతను అనుసరించి అందులో ఉన్న అర్థం పరమార్థాన్ని గ్రహించాలన్నారు. జనవరి 5న విజయవాడంలో జరగబోయే హైందవ శంఖారావంలో హిందువులందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్, గాదె వెంకన్న, శశికాంత్ ఆచార్యులు, బంగారు పమణి, యాళ్ల ప్రసాద్, తులసి తదితరులు పాల్గొన్నారు.

నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం


పెనుగొండ ఎస్వీకేపీ గ్రౌండ్‌లో వాకింగ్ చేస్తున్న వాకర్స్


పెనుగొండ ఎస్వీకేపీలో వామప్ అవుతున్న వాకర్స్

పెనుగొండ: నానాటికీ మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవన శైలితో రోగాల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి నడక శరణ్యమవుతుందని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో వాకింగ్‌పై నానాటికి దృష్టిసారించే వారి సంఖ్య పెరుగుతూ వస్తుంది. పట్టణాలు మొదలుకుని చిన్న గ్రామాల వరకూ ఉదయం సాయంత్రం నడిచేవారి సంఖ్య పెరుగుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో మధుమేహం, గుండెపోటు, ఊబకాయం వంటి వ్యాధుల బారిన పడేవారి సంఖ్య అధికంగా ఉంది. దీంతో వీటికి నడకే దివ్య ఔషధంగా బావించి నడకకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వీటి భారిన పడి మందులకు ఆర్థికంగా మరింత నష్టపోవడం కన్నా, ఉదయం సాయంత్రం నడకు సమయం కేటాయించి ఆరోగ్యాన్ని రక్షించుకుంటున్నారు. చిన్న వయస్సు వారి నుంచి పెద్ద వయస్సు వారు సైతం వాకింగ్ చేయాలనే తలంపుతో ప్రతిరోజు వాకింగ్ చేస్తున్నారు. వీరి కోసం కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక ట్రాక్‌లు సైతం ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర కేఎస్‌రాజు కళాశాలలోలనూ. పెనుగొండ పంచాయతీ పార్కువద్ద, ఆచంట ఎంవీఆర్ కళాశాల వద్ద, పంచాయతీ చెరువు వద్ద, సిద్ధాంతం ఏటిగట్టు నుంచి జాతీయ రహదారి వరకూ, మార్టేరు ఎస్వీజీ ఉన్నత పాఠశాల వద్ద వాకింగ్ చేసే వారి సంఖ్య నానాటికీ పెరుగుతుంది.

వాకింగ్‌తో ప్రయోజనాలెన్నో

వాకింగ్‌తో సుగర్, గుండెజబ్బులు, బీపీ, క్యాన్సర్లు వచ్చే అవకాశాలు తక్కువగా ఉండడంతో పాటు, నియంత్రణలో ఉంటాయి. రోజూ ఉదయం, సాయంత్రం గంట పాటు వాకింగ్ చేయడం వల్ల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మానసిక ఒత్తిడిని నివారించడంతో పాటు, ప్రశాంతతు కల్పించడానికి వాకింగ్ ఉపయోగపడుతుంది. ఊబకాయం తగ్గడంతో పాటు, రక్త ప్రసరణ సరిగ్గా జరగడానికి దోహద పడుతుందంటూ వైద్య నిపుణులు చెబుతున్నారు.

ప్రత్యేక క్లబ్‌లు

ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రారంభించిన వాకింగ్ స్నేహబంధాన్ని పెంచుతుంది. ఎక్కడెక్కడి వారో తెల్లవారుతుండగానే ఒకరికొకరు పలకరించుకుంటూ ఉత్సాహంగా వాకింగ్ చేస్తున్నారు. కొన్ని మండలాల్లో అయితే వాకర్స్ క్లబ్‌లు సైతం ఏర్పాటు చేసి స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్లబ్‌ను జిల్లా వ్యాప్తంగా అనుసంధానం చేసుకొంటూ ప్రఖ్యాత క్లబ్‌లైన లయన్స్, రోటరీ, మానవత వంటి స్వచ్ఛందసంస్థలకు దీటుగా స్వచ్ఛంద సేవలు అందిస్తూ మన్ననలు పొందుతున్నారు.

మానసిక ప్రశాంతత చేకూరుస్తుంది



వాకింగ్ ఆరోగ్యానికి దోహద పరచడంతో పాటు, మానసిక ప్రశాంతత కల్పిస్తుంది. ఉదయం సాయంత్రం ఎందరో వాకింగ్‌లో పాల్గొంటూ స్నేహ బంధాన్ని పటిష్టం చేసుకుంటున్నాం. వాకింగ్ 10 ఏళ్లకు పైగా చేస్తున్నా. ప్రతి ఒక్కరూ సోదర భావంతో వాకింగ్ చేస్తుండడంతో మానసిక ఒత్తిడి దూరమై ప్రశాంతంగా ఉంటుంది.

– కాకర శశికుమార్, ఆంగ్ల అధ్యాపకులు, ఎస్వీకేపీ కళాశాల, పెనుగొండ

జీవనశైలిలో మార్పులు



నిత్యం ఉదయం సాయంత్రం నడకతో జీవన శైలిలో మార్పులు వచ్చాయి. ఎనిమిదేళ్లుగా నిత్యం వాకింగ్ చేస్తున్నా. అత్యవసరమైతే తప్ప మానకుండా నిత్యం వాకింగ్ చేస్తున్నా. రోజంతా ఉల్లాసంగా గడపడానికి వాకింగ్ ఉపయోగ పడుతంది. ప్రతి ఒక్కరూ వాకింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

– కె.సూర్యనారాయణ, మానవత, పెనుగొండ

ఒత్తిడి దూరం



ఉదయమే వాకింగ్ చేస్తుండడంతో ఒత్తిడి దూరం అవుతుంది. ఆహారపు అలవాట్లు మారడం, వ్యాపార ఇబ్బందులుతో అందరిలోనూ ఒత్తిడి పెరుగుతుంది. వాకింగ్ చేయడం ద్వారా ఒత్తిడిని దూరం చేసుకోవచ్చు. ఆరోగ్యాన్ని సైతం కాపాడుకోవచ్చు.

– బందారు సత్యనారాయణ, వ్యాపారి, పెనుగొండ